# వెంకాయమ్మకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4.55లక్షలు మంజూరు

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

**పొన్నూరు, మార్చి 4,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కసుకర్రు గ్రామానికి చెందిన సందు వెంకాయమ్మ అనే మహిళకు వైద్యం చేయించుకునేందుకు




ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు అయ్యాయి. అందుకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ చేతుల మీదుగా వెంకాయమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు. వెంకాయమ్మకు వచ్చిన వ్యాధి నివారణకు రూ.4.55లక్షలు ఖర్చవుతుందని గుంటూరుకు చెందిన ఆదిత్య మల్టీ స్పెషాలిటీ వైద్యులు తెలిపారు. వెంకాయమ్మ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో వైద్యం చేయించుకునే స్తోమత లేదు. దీంతో చేసేదేమీ లేక ముఖ్యమంత్రి సహాయనిధి కోసం ఎమ్మెల్యేను ఆశ్రయించేందుకు గ్రామంలోని నాయకుడు బొప్పన బాపనయ్యను ఆశ్రయించడంతో బాపనయ్య ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి లేఖ వ్రాయించారు. ఎమ్మెల్యే లేఖకు స్పందించిన ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు చేసే అధికారులు రూ.2,01,460 మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు. దీంతో ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు కసుకర్రు గ్రామస్తులు, వెంకాయమ్మ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిధులు మంజూరు చేసి ఎంతో మంది పేదలకు చేయూతగా నిలుస్తుందని పలువురు కొనియాడారు.

# మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

## మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

**పొన్నూరు, మార్చి 4,ప్రభాతవార్త:** పురపాలక సంఘ పరిధిలో నివశించే ప్రజలకు మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు హామీ ఇచ్చారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. 12వ వార్డులోని ప్రజలు ఆ వార్డులో సీసీరోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, తమ రాకపోకలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు నిర్మాణం చేయాలని కమిషనర్‌ను కోరారు. దీంతో స్పందించిన కమిషనర్ వార్డులో పర్యటించి రోడ్డు నిర్మాణానికి సంబంధించి పరిశీలించారు. సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. పట్టణాన్ని స్వచ్ఛ స్వర్ణపురిగా తీర్చిదిద్దేందుకు పురపాలక సంఘం చేస్తున్న చర్యలకు



సహకరించాలన్నారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.పోతురాజు, సచివాలయ సిబ్బంది, టిడిపి నిడుబ్రోలు అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్ తదితరులున్నారు.

# వైకాపా బలోపేతానికి కృషి చేయాలి

## వైకాపా కాపునాయకుడు ఆకుల రామమోహన్

**పొన్నూరు, మార్చి 4,ప్రభాతవార్త:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వార్డు, బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కాపునాయకుడు ఆకుల రామమోహన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 2,3,30,31వార్డులకు సంబంధించి అనుబంధ విభాగాల నియామక ప్రక్రియను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల రామమోహన్ మాట్లాడుతూ పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే దిశగా మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి శ్రీకారం చుట్టారని, అందుకు సంబంధించి పార్టీకి సంబంధించి వివిధ అనుబంధ విభాగాల కమిటీలను పూరి_స్థాయిలో నియమించడంతోపాటు ఆయా కమిటీల సభ్యులు పేర్లను ఆన్‌లైన్ చేయడం, వారికి ఐడి కార్డులు ఇవ్వడం, రానున్న కాలంలో పార్టీని సంస్థాగతంగా బలపేతం చేసేందుకు నిర్వహించే కార్యక్రమాలను పక్కాగా అమలయ్యే విధంగా చూసేందుకు దిశానిర్ధేశం చేస్తున్నారు. అందులో భాగంగా ప్రతి వార్డులో అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంపిక చేసిన అనుబంధ విభాగాల సభ్యులను జాబితాలను పార్టీ అధిష్ఠానానికి



అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ నాజర్, అమిరినేని సాంబశివరావు,డేగల శ్రీరామమూర్తి, చిల్లర నాగరాజు, అంబటి వెంకటేశ్వరరావు, ఆకుల చిన వెంకటేశ్వరరావు, నున్నా వెంకటేశ్వర్లు,యరసాని పవన్‌కుమార్, ఏలూరి చెంచు నాగరాజు, షేక్ గౌస్ బాషా తదితరులున్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

## పంచాయితీరాజ్ ఎస్‌ఈ జి.శ్రీనివాసులు

పొన్నూరు, మార్చి 4,ప్రభాతవార్త: గ్రామాల్లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయితీరాజ్ ఎస్‌ఈ జి.శ్రీనివాసులు ఆదేశించారు. మండల పరిధిలోని



మాచవరం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న పలు సీసీ రోడ్లను అధికారుల బృందం బుధవారం సందర్శించి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల నిర్మాణం చేపట్టినా, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత అధికారులు, కాంట్రాక్టులపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. గ్రామాల్లో చేపట్టి అభివృద్ధి పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నదే కూటమి ప్రభుత్వం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. ఎస్‌ఈ శ్రీనివాసులు వెంట డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శంకర్,ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఎపిఓ సుభాషిణి, తదితరులున్నారు.

# భాజపా జెండా పేదవానికి అండ

## భాజపానాయకుడు పూల సుబ్రహ్మణ్యం

**పొన్నూరు, మార్చి 4,ప్రభాతవార్త:** బిజెపి జెండా పేదవానికి మరింత అండ అని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు పూల సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇ-గవర్నెన్స్ సేవలు అందించడం, డిజిటల్ ఇండియా మౌళిక వసతులు విస్తరిస్తాం దన్నారు. 5.21లక్షల ఉమ్మడి సేవా కేంద్రాల ఉండగా వీటిలో 4.13లక్షల కేంద్రాలు గ్రామ పంచాయితీ స్థాయిలో ప్రజలు డిజిటల్ అవసరాలు



తీరుస్తున్నాయన్నారు. 70కోట్ల మంది భారతీయులు రూపే కార్డుల ద్వారా భారతదేశపు అంతర్జాతీయ చెల్లింపులు చేస్తున్నారన్నారు. ఉమాంగ్ యాప్ ద్వారా 877రాష్ట్ర ప్రభుత్వ శాఖలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం నుండి రాత్రి వరకు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొంటారన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు, ప్రతిక్షణ కార్యవర్గ సభ్యుడు కుమార్‌గౌడ్, పూల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

## మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

**పొన్నూరు, మార్చి 4,ప్రభాతవార్త:** రాబోయే విద్యా సంవత్సరానికి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి



విజయభాస్కర్ కోరారు. అన్ని వసతులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేరి ్పంచి వారి భవితకు బంగారు బాటవేసే విధంగా తల్లిదండ్రులో ఆలోచన చేయాలన్నారు. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించారు.ఆయా పాఠశాలల పరిధిలోని గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులను రాబట్టుకునేందుకు ఉపాధ్యాయులు వేట ప్రారంభించారు. అందులో భాగంగా చింతలపూడి ఎంపిపిఎస్ పాఠశాల ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అడ్మిషన్ ఫారాలను అందజేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా కలిగి ప్రయోజనాలను వారు వివరించారు.

# జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

## వడ్రాణం మార్కండేయ బాబు

**పొన్నూరు, మార్చి 4,ప్రభాతవార్త:** జనసేన పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు వడ్రాణం



మార్కండేయబాబు కోరారు. స్థానిక 1,2వార్డుల్లో జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాలను చేర్పించే దిశగా నాయకులు,కార్యకర్తలు ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించే సత్తా ఒక్క కూటిమి ప్రభుత్వానికే ఉందన్నారు. గతంలో కంటే ఈసారి పెద్ద ఎత్తున సభ్యత్వాన్ని చేర్పించే విధంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో యన్నం నాయుడు, గోపికృష్ణ, తాళ్ళూరి అప్పారావు, దేశంశెట్టి సూర్య, ఆదెళ్ళ వాసంతి, సింగంశెట్టి శంకర్, గాజుల సుబ్బారావు, వెన్ను రామారావు, కసుకర్తి అరుణ, తాడికొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ సేవలను మరింత విస్తృతం చేయాలి



**తుళ్ళూరు,మార్చి 4,ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల్లో పోస్టల్ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఏపి సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బి.పి.శ్రీదేవి అన్నారు.రాజధాని అమరావతి పరిధిలోని తుళ్ళూరు మండలం మందడంలోని బ్రాంచ్ ఆఫీసును శ్రీదేవి బుధవారం సందర్శించారు.గోల్డెన్ రూల్ హైస్కూల్లో మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని మొత్తం 21బ్రాంచ్ ఆఫీసుల పనితీరుపై సమీక్షించారు.ఈ సమీక్షలో ఈసిఆర్/ఐసిఆర్ ప్రమాణాల బలోపేతం,బ్రాంచ్ ఆఫీసుల ఆర్థిక స్థిరత్వంపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు.బ్రాంచ్ పోస్టుమాస్టర్లు వ్యాపారాభివృద్ధి,ఆధాయవృద్ధి,వినియోగదారుల చేరువయ్యే కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించాలన్నారు.తపాలా సేవల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అనంతరం బ్రాంచ్ పోస్టుమాస్టర్ పోలు నరసింహారావు,పెనుమాక బ్రాంచ్ పోస్టుమాస్టర్ బానోత్ నాగమణి,వెంకటపాలెం బ్రాంచ్ పోస్టు మాస్టర్ షేక్ హనీఫ్ ను అభినందించారు.ఉత్తమ పని విధనాలపై కొత్తగా నియమితులైన బ్రాంచ్ పోస్టు మాస్టర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతీ బ్రాంచ్ ఆఫీస్ వారానికి 5పోస్టల్ ఆర్టికల్స్ బుకింగ్ చేయాలని అమె నిర్ధేశించారు.మెయిల్ పరిమాణం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సేవింగ్స్ ఖాతాలు,పిఎల్ఐ,రూరల్ ఇన్సూరెన్స్ వ్యాపారాల పెంపుకోసం ఇంటింటి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు.నిర్ధేశించిన లక్ష్యాలను సాధించి,సేవ ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు నిబద్ధతతో పని చేస్తామని బ్రాంచ్ పోస్టు మాస్టర్లు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ యు.యలమందయ్య,అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసర్ రాధా కృష్ణమూర్తి,పోస్టల్ ఇన్స్‌పెక్టర్ ప్రసన్నవెంకట సాయి ఉన్నారు.

# మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ దోహదం : మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

**పెదనందిపాడు మార్చి 4 (ప్రభాతవార్త):** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) వారి సహకారంతో పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ 5 వ బ్యాచ్ ముగింపు, 6 వ బ్యాచ్ ప్రారంభ సభ బుధవారం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ శాసనమండలి సభ్యులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కె ఎస్. లక్ష్మణరావు, గుంటూరు గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కన్వీనర్ పాశం రామారావు, పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య, విద్యావేత్త ముద్దన రాఘవయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నూర్ భాషా సుభాని సాహెబ్, జంపని రామారావు, (దాత నాట్స్ పూర్వాధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి తల్లిదండ్రులు)నూతి సుబ్బారావు, నూతి సీతాదేవి లు హాజరయ్యారు.ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బహుముఖ కార్యక్రమాలు నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి, కుట్టు శిక్షణ కార్యక్రమాలకు విశేష సహాయ సహకారాలు అందించిన నాట్స్ పూర్వ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి, నాట్స్ కమిటీ ఎంతో దోహదం చేశారన్నారు. మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని, చక్కగా నేర్చుకొని తమ ఉపాధిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం, దాతలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ట్రస్టీ పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో అనేక చోట్ల విజ్ఞాన కేంద్రాలు నిర్వహిస్తూ ఉపాధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతల సహకారంతో భవిష్యత్తులో విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ, ట్యూషన్ పాయింట్ వంటివి నిర్వహిస్తామని తెలియజేశారు. మహిళా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రగ్స్, గంజాయి, మద్యం నిర్మూలనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దాత ముద్దన



రాఘవయ్య మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం నిర్వహించే కార్యక్రమాలు పలువురికి ఉపయోగపడే విధంగా ఉన్నాయని చెప్పారు. భవిష్యత్తులో వారు చేపట్టే కార్యక్రమాలకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఇప్పటివరకు 110 మంది మహిళలకు కుట్టు శిక్షణ నేర్పించి సర్టిఫికెట్లు అందించామని తెలిపారు. దాతల సహకారంతో 31 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య, నూర్ భాషా సుభాని సాహెబ్,టి. ప్రతాపరెడ్డి తదితరులు మాట్లాడారు. 5 వ బ్యాచ్ లో కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలందరికీ శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. దాతలు దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, కాపు శ్రీనివాస్ ల సహకారంతో ఐదుగురు మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలు తాము కుట్టిన బట్టలను సమావేశంలో ప్రదర్శించారు. గతంలో శిక్షణ పొందిన మహిళలు తమ ఆర్థిక అభివృద్ధికి కుట్టుశిక్షణ ఎంతో దోహదపడిందని తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కుట్టు శిక్షణ టీచర్ కొర్రపాటి లక్ష్మి ని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం సభ్యులు కొత్త వెంకటశివరావు, నల్లమోతు రాజేంద్ర, అన్నలదాసు ఆశీర్వాదం, ఫణిదపు భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ , కుట్టు శిక్షణ మహిళలు పాల్గొన్నారు.

# ఎస్ఆర్ఎంలో ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం

**మంగళగిరి, మార్చి 4, ప్రభాతవార్త:** ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం జరిగింది. యూనివర్సిటీలోని ఎన్విరాన్మెంటల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వన్యప్రాణులు, ఔషధ మొక్కలు, పర్యావరణ పరిరక్షణపై వర్క్ షాప్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ లోని డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా స్టేట్ డైరెక్టర్ ఫరీదా టంపాల్ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, వన్యప్రాణుల సంరక్షణ గురించి వివరించారు. ప్రపంచ జనాభాలో 80 శాతం మంది ఔషధ మొక్కల ఆధారిత సాంప్రదాయ వైద్యంపై ఆధార పడ్తున్నారనీ, పర్యావరణ పరిరక్షణ కేవలం జీవశాస్త్ర సంబంధ విషయం కాదన్నారు. యూనివర్సిటీ డీన్ డాక్టర్ టామి మాట్లాడుతూ, అడవుల సంరక్షణతో పాటు, పర్యావరణ సమతుల్యత కోసం



శ్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యూనివర్సిటీ ఎన్విరాన్మెంటల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ షాజి, ప్రొఫెసర్ శ్రీనాథ్ సుబ్రహ్మణ్యంలు వన్యప్రాణులు, మానవుల మధ్యగల అన్యోన్య సంబంధాన్ని, జీవవై విద్యాన్ని వివరించారు. పర్యావరణ పరిరక్షణే ప్రధాన లక్ష్యమున్న కోణంలో వర్క్ షాప్ కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. అడవులు, వివిధ రకాల వన్యప్రాణులు, ఔషధ మొక్కలు, వాటి అవశ్యకతలను వివరించే చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు.

# సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ

**పిడుగురాళ్ల, మార్చి 4 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పిడుగురాళ్లలో బుధవారం ఫామ్ ఆయిల్‌లో సమగ్ర పోషక యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణా, అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వ్యాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్



కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహనరావు హాజరై మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ గెల్లలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తామన్నారు. ఆయిల్ ఫామ్ పంట మెలకులు, యాజమాన్య పద్దతులను, సస్య రక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్నామన్నారు. తోట నాటే ముందుగా పొలాన్ని లోతుగా దున్ని సేంద్రియ ఎరువులను కపలపాలన్నారు. ఆరోగ్య కరమైన, ధృవీకరించిన నాట్లను మాత్రమే నాటాలన్నారు. ఫామ్ ఆయిల్ తోటలకు యేడాది పొడవునా సమర్థమైన నీటి సరఫరా అవసరం కాబట్టి సాగునీటి పద్దతి ఉపయోగించి నీటిని ఆదా చేయాలన్నారు. వేసవిలో మల్చింగ్ చేయడం వలన మట్టి తేమ నిల్వ - ఉత్పత్తి మెరుగవుతుందన్నారు. నేల పరీక్ష ఆధారంగా ఎన్‌పీకే, సూక్ష్మ పోషకాలను సరైన మోతాదులో ఇవ్వాలన్నారు. యేడాదికి 4 విడతలుగా ఎరువులు వేయడం ఉత్తమమన్నారు. మెగ్నీషియం, బోరాన్ లోపాలను గుర్తించి సరిచేయాలన్నారు. మొదటి మూడేళ్ల వచ్చే పుష్పగుచ్చాలను తొలగించడం ద్వారా మొక్క శక్తివంతంగా పెరుగుతుందన్నారు. కలుపు నియంత్రణ, తోట పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పంట చుట్టూ రింగ్ వీడింగ్ విధానం అనుసరించాలన్నారు. ఫంగల్ వ్యాధులు రాకుండా మంచి డ్రైనేజీ, అవసరమైతే కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా కార్బెండాజిం వంటి మందులు వాడాలన్నారు. మండల ఉద్యానవన అధికారి అంజలి మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు, రాయితీ వివరాలను వివరించారు. మొక్కల ఖరీదుపై 100 శాతం రాయితీతో ఒక హెక్టారుకు 150 మొక్కలు చొప్పున విదేశీ మొక్కలకు రూ.190 చొప్పున, దేశీ మొక్కలైతే రూ.133 చొప్పున రూ.29 వేల రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. బిందు సేద్యం ద్వారా కూడా ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిబంధనల ప్రకారం ఆయిల్ ఫామ్ సాగు చేసుకున్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్ పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ ఏరియా మేనేజర్ నవీన్, ఫీల్డ్ స్టాఫ్ రాజు, నాగరాజు, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

# నేరాలను అరికట్టడానికి విజిబుల్ పోలీసింగ్

**నరసరావుపేట క్రైమ్, మార్చి 4 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి , శివుడు బొమ్మ , గడియార స్తంభం, రైల్వే స్టేషన్ రోడ్డు నందు ట్రైనీ ఐపీఎస్ నిరంజన్, నరసరావుపేట ఇన్చార్జి డిఎస్పి ఎం . హనుమంతరావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు



నిర్వహించారు. నరసరావుపేట 1వ పట్టణ సీఐ షేక్ .టి . ఫిరోజ్, నరసరావుపేట 2వ పట్టణ ది. ప్రభాకర్, నరసరావుపేట రూరల్ సీఐ ఎం .వి .సుబ్బారావు,ట్రాఫిక్ సీఐ సిహెచ్ .లోకనాథం, ఎస్సైలు అరుణ రెడ్డి, బి యస్నా, పోలీసు అధికారులు,సిబ్బందితో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించి అక్రమ మద్యం, గంజాయి, గుట్కా, మరియు ఇతర నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ రవాణాను అరికట్టనున్నట్లు తెలిపారు.మహిళల కళాశాలలు, బాలికల పాఠశాలలు,బస్టాండ్ లు, రైల్వే స్టేషన్ లు మరియు ముఖ్యమైన కూడళ్ళలో పెట్రోలింగ్ మరియు గస్తీ పటిష్టంగా నిర్వహించనున్నట్లు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఆకతాయిల పై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఓవర్ లోడింగ్ మరియు హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారి మీద మోటారు వాహనాల నూతన చట్టాల ప్రకారం అపరాధ రుసుం విధిస్తున్నట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపినారు.

# ఘనంగా తెదేపా సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య జన్మదిన వేడుకలు

**నరసరావుపేట, మార్చి 4 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ , ప్రముఖ సంఘ సేవకులు కొల్లి బ్రహ్మయ్య జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పల్నాడు రోడ్ లోని శ్రీకృష్ణ చైతన్య విద్యాసంస్థల ఆవరణలో అభిమానులు, టిడిపి నాయకులు కార్యకర్తలతో కొల్లి బ్రహ్మయ్య జన్మదిన వేడుకలు సందడిగా నిర్వహించారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు జన్మదిన వేడుకలను ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ పట్టణ, నియోజకవర్గ, నరసరావుపేట రొంపిచర్ల మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ లు,



సాగునీటి సంఘాల అధ్యక్షులు, తెలుగు మహిళా నాయకురాలు, తెలుగు యువత నాయకులు, క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారీ కేకులు, పూలదండలు,శాలువాలతో ఆయనను సన్మానించారు. మిఠాయిలు పంచిపెట్టారు. త్రికోటేశ్వర స్వామి దేవాలయ అర్చకులు ఆశీర్వచనాలను అందించారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనాధ శరణాలయాల్లో సేవా కార్యక్రమాలను అభిమానులు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య మాట్లాడుతూ తనపై అభిమానంతో జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు తో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు నాయకత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల విజయవంతనికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి ప్రతినిత్యం పాటుపడతానని కొల్లి బ్రహ్మయ్య తెలియజేశారు. తాను నిర్వహించే సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న మిత్రులకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని కొల్లి బ్రహ్మయ్య ఈ సందర్భంగా తెలియజేశారు.

# అంతర్జాతీయ చిత్రలేఖన పోటీల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల ఘనత

**గుంటూరు విద్య మార్చి 4 ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని నల్లచెరువు, ఇందిరా గాంధీ నగర్ నందున్న నగరపాలక సంస్థ ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటారు. రంగోత్సవ్ ఇంటర్నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్ వారు నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా తన కార్యాలయంలో విద్యార్థులకు ఈ అవార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవడం



అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ దరియావలి, ఉపాధ్యాయులు కొరివి విజయ్ బాబు, థెరెసమ్మ, సుశీల, మరియు శంకర వరప్రసాద్ పాల్గొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ వేదికపై గుర్తింపు పొందడం పట్ల ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు మానసిక ఆందోళనలు పోగొట్టేందుకే
# ప్రత్యేక తరగతులు

**యడ్లపాడు, మార్చి 4, ప్రభాతవార్త :** పభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కెరీర్ మార్గదర్శనం, మానసిక ఆరోగ్యంపై కౌన్సిలింగ్ అందించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల పోస్టుల భర్తీకి చేసి మండలానికి ఒక బోధకురాలను ఎంపిక చేయటం జరిగిందని ఎంఇవో నాగరత్నం తెలిపారు. అమె వివరిస్తూ సమగ్రశిక్ష అభియాన్" వారు ప్రతి మండలంలోని ఉన్నత



పాఠశాలలలో 6నుండి 12 వ తరగతి విద్యార్థులకు మానసిక ఆందోళన, పరీక్షల భయాన్ని పోగొట్టడానికి సైకలాజికల్ కౌన్సెలర్ లను తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టడం జరిగింది. అందులోభాగంగా యడ్లపాడు మండలంలో జొన్నలగడ్డ లూధియా మంగళవారం బాధ్యతల్లో చేరడం జరిగిందని, ఆమె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, యడ్లపాడు నందు విద్యార్థులకు కౌన్సిలింగ్ తరగతులు నిర్వహించారన్నారు.

## విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందజేత

**యడ్లపాడు, మార్చి 4, ప్రభాతవార్త :** మండలంలోని కారుచోల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణకుమారి మంగళవారం అందించారు. ఈ యొక్క కార్యక్రమంలో అధ్యక్షురాలు,ఉప అధ్యక్షుడు వై ప్రసాదరావు, ఎన్



పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి నరేంద్ర సువర్ణ కుమారి పౌండేషన్ శ్యామ్ ప్రణీత్, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ రథాల ద్వారా నిత్యవసర సరుకులు : బ్రహ్మయ్య

**పెదకూరపాడు,మార్చి4,ప్రభాతవార్త:** స్వచ్ఛ రథాన్ని మండల టిడిపి అధ్యక్షులు ఏటుకూరు బ్రహ్మయ్య, సర్పంచ్ గుడిపూడి రాజులు ప్రారంభించారు. స్వచ్ఛ రథాల ద్వారా ఇళ్లలో ఉన్న పాత సామాను పాత పుస్తకాలు,ప్లాస్టిక్ డబ్బాలు,వేస్ట్ సామానులు, స్వచ్ఛ రథాల ద్వారా తీసుకుని వాటికి బదులుగా నిత్యవసర సరుకులు అందిస్తారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం స్వచ్ఛ గ్రామాలుగా ఉండేందుకు ప్లాస్టిక్



వ్యర్థాలను స్వచ్ఛ రథాల ద్వారా కొనుగోలు చేసి కొంతమేర గ్రామ వాతావరణ మారుస్తాయని ఆయన అన్నారు. స్వచ్ఛ రకాలు గ్రామాల్లో తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తూ ప్రజలకు అవసరమైన నిత్యవసర సామాగ్రి అందిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్ మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, 14వ డిసి ఛైర్మన్ అప్పారావు, మాదినేని సత్యం, కంచర్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వెలగపూడి రామకృష్ణ జయంతి ఉత్సవాలు

**మాచర్ల, మార్చి 4, ప్రభాతవార్త:** కేసీపీ సంస్థల వ్యవస్థాపకులు వెలగపూడి రామకృష్ణ జయంతోత్సవాలు స్థానిక కిడ్స్ పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా







పాల్గొన్న మానవ వనరుల విభాగ అధికారి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి వెలగపూడి రామకృష్ణ చేసిన సేవలను కొనియాడారు. సంస్థలో సుదీర్ఘ సేవలందించిన వారికి బహుమతులు అందజేశారు. మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు విభాగాధిపతులు, అధికారులు, పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుంది : పిన్నెల్లి రమ

**మాచర్ల, మార్చి 4 ప్రభాతవార్త:** పట్టణంలోని 8వ వార్డు కౌన్సిలర్ 8వ వార్డుకు చెందిన ఆదెపు అన్నమ్మ మందా సంతోషరావు ఆధ్వర్యంలో పార్టీ



అనారోగ్యంతో మరణించగా, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సతీమణి రమా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ కుటుంబానికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఆదెపు మరియదాసు, ఆదెపు యేసయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతి చెందిన విద్యార్థికి నివాళులర్పించిన డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట టౌన్, మార్చి 4 ప్రభాతవార్త ::నరసరావుపేట మండలం బసికాపురం గ్రామంలో మంగళవారం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి మరణించిన జంగా రాజశేఖర్ (గోపి) కు పల్నాడు జిల్లా వైయస్సార్సీపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నివాళులర్పించారు. రాజశేఖర్ పార్థివ దేహాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థి మున్సిపట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు.



కార్యక్రమంలో వైసీపీ నాయకులు మూరాబోయిన శ్రీనివాసరావు, జడ్పిటిసి పదమొత్తం చిట్టిబాబు, యాంపాటి వెంకటప్పరెడ్డి, కొల్ల వెంకటనారాయణ, గ్రామ వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులే ఉపయోగించుకోవాలి
### జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా

**నరసరావుపేట, మార్చి 4,ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు తమ అభివృద్ధికి వినియోగించుకునేలా చూడాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. డ్వాక్రా రుణాలు వ్యాపారాలకు బదులుగా కుటుంబ అవసరాలకు వినియోగించడం, బాలింతలు



మరియు బాలలకు ఇచ్చే పౌష్టికాహారం కుటుంబంలోని అందరూ వినియోగించడం చేయకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ గ్రామ హెల్త్ కేర్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మండలానికి రూ.90 లక్షల చొప్పున గ్రామాల్లో పన్ను వసూళ్లు చేయాలని డీపీవోను ఆదేశించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందితో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలు పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ లోని ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఇంచార్జ్ డి.ఆర్.ఓ నారద ముని, డి.ఎం.హెచ్.వో డాక్టర్. రవి, ఐ.సి.డి.ఎస్ పి.డి, ఎం ఉమాదేవి, డి.పి.ఓ వి నాగేశ్వరరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్1లో సత్తా చాటిన నరసరావుపేట యువకుడు

**నరసరావుపేట మార్చి 4 ప్రభాతవార్త ::** నరసరావుపేట పట్టణంలో వరవకట్టకు చెందిన షేక్ ఇసుబ్ సలాం గ్రూప్1 ఫలితాల్లో ప్రతిభ చాటి ఆర్టీవో (ఆర్‌టీవో)గా ఎంపికయ్యారు.తండ్రి సుభానీ కార్పెంటర్‌గా పని చేస్తుండగా,తల్లి గృహిణి.సామాన్య కుటుంబ నేపథ్యం ఉన్నప్పటికీ పట్టుదలతో శ్రమించి ఇసుబ్ సలాం ఈ విజయాన్ని సాధించారు.కఠినమైన పోటీని తట్టుకుని ఉన్నతాధికారిగా ఎంపిక కావడంతో పట్టణ



ప్రజలు,కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డా చదలవాడ అరవింద బాబు ఇసుబ్ సలాంను ప్రత్యేకంగా అభినందించారు.సాధారణ కుటుంబం నుంచి వచ్చిన యువకుడు కృషి ,పట్టుదలతో గ్రూప్1లో విజయం సాధించడం ఎంతో గర్వకారణమని తెలిపారు.ఇలాంటి విజయాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.నియోజకవర్గంలోని యువత ఉన్నత లక్ష్యాలు పెట్టుకుని చదువులో రాణించాలని,ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాచదలవాడ సూచించారు.ఇసుబ్ సలాం భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, నివాళులర్పించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట,మార్చి 4, ప్రభాతవార్త :** నరసరావుపేట మండలం బసికాపురం గ్రామంలో ఈత కు వెళ్లి ఇంటర్ విద్యార్థి గోపి (16) నీటి గుంటలో మునిగి మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు బుధవారం బసికాపురం గ్రామాన్ని సందర్శించారు. మృతి చెందిన విద్యార్థి గోపి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. ఈ చిన్న



వయసులో విద్యార్థి మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు.ఆ కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జనసేన, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు..

# ఆన్ లైన్ మోసాలను అరికట్టండి
## బ్యాంకు అధికారులకు ఎంపీ,జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సూచన

**నరసరావుపేట,మార్చి 4,ప్రభాతవార్త :** మ్యూల్ అకౌంట్ల ద్వారా జరుగుతున్న ఆన్ లైన్ మోసాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని బ్యాంకు అధికారులను ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కోరారు. కాలేజీ విద్యార్థుల బ్యాంకు అకౌంట్లకు డబ్బులు చెల్లించి మరీ మోసాలకు వాడుతున్న విధానాన్ని నిరోధించేందుకు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకు ప్రతినిధులతో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్యాంకులు నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాల ద్వారా శిక్షణ పొందిన వారిలో 80 శాతం మందికి ఉపాధి లేదా వ్యాపార అవకాశాలు దక్కేలా చూడాలన్నారు. సూర్యఘర్ పథకం కింద సబ్సిడీ రుణాల వితరణ వేగవంతం చేయాలన్నారు. రికవరీ సమస్యలున్న డ్వాక్రా రుణాల అకౌంట్ల వివరాలు డీఆర్డీఏకు అందించాలన్నారు. విద్యార్థులకు హాస్టల్ ఫీజులు, ఇతర ఖర్చుల వినియోగానికి తక్కువ మొత్తంలో విద్యా రుణాలు అందించాలన్నారు. విద్యా రుణాలపై కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. రుణ వితరణ లక్ష్యాలు చేరుకోని బ్యాంకుల నుంచి వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. జూన్‌జులై నాటికి కౌలు రైతులకు సీసీఆర్సీ





కార్డులు అందించి పంట రుణ వితరణ జరిగేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. పశు పెంపకం దారులకు కేవలం నాలుగు శాతం వడ్డీతో ఒక్కో పశువుపై రూ.50,000 నుంచి రూ.లక్ష వరకూ అందించే రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. మార్చి మూడో వారంలోగా క్లస్టర్ విధానంలో మండలాల వారీగా ఏర్పాటు చేసిన క్లస్టర్ల అభివృద్ధికి రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్ పర్సన్ మక్కెన మల్లికార్జున రావు, ఎల్డీఎం రామ్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అవగాహన సదస్సు

**నరసరావుపేట టౌన్,మార్చి 4 ప్రభాతవార్త :** జొన్నలగడ్డ గ్రామంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో గత ఐదు రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమంలో



రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ విషయనిపుణులు ఎస్. మనోజ్ భరత్, షేక్. నెహ్మా, శివశంకర్ లు హాజరై, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో ఎలక్ట్రానిక్స్ స్కోప్, ఎలక్ట్రికల్ వాహన డిజైన్స్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. నారాయణ, ఇన్చార్జి సిహెచ్. నాగేశ్వరరావు, డాక్టర్ టి. జగదీష్, డాక్టర్ ఎం. అపర్ణ, షేక్. అన్సర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్యాక్రాంతమైన దళితుల భూములను పరిరక్షిస్తాం
### -ఎస్సీ కమిషన్ మెంబర్ మేకల భిక్షం

**మాచర్ల, మార్చి 4,ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమైన దళితుల భూములను పరిరక్షిస్తామని ఏపీ రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ మేకల భిక్షం స్పష్టం చేశారు. బుధవారం పట్టణానికి చెందిన ఎస్సీ మహిళ మాచర్ల మరియమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతంలో సర్వే నెం.1053-18/బి2 భూమిని కమిషన్ పరిశీలించింది. అనంతరం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. స్థానిక కేసీపీ అతిథిగృహంలో దళితుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి, పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచర్లకు చెందిన





మరియమ్మ, ఇతరులు కలిసి వారి వ్యవసాయ భూమిని స్థానిక ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన భూమిగా నమోదు చేసి, నిషేధిత భూముల జాబితాలో చేర్చారని ఆరోపిస్తూ కమిషన్‌ను ఆశ్రయించారన్నారు. వారి ఫిర్యాదు మేరకు పట్టణంలో పర్యటించామన్నారు. ఆ భూమిని పరిశీలించి, రెవెన్యూ అధికారులతో సమీక్షించామన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు కిరణ్‌కుమార్, పట్టణ సీఐ వెంకటరమణ, సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా పలువురు అధికారులు కమిషన్ మెంబర్‌ను ఘనంగా సన్మానించారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

కారంపూడి, మార్చి 4 ప్రభాతవార్త: స్థానిక ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షా సామాగ్రి పంపిణీ చేశారు. సత్తెనపల్లి హెల్ప్ ఫౌండేషన్



ఆధ్వర్యంలో వినుకొండ మండలం వెల్లటూరుకి చెందిన మరనాత యేసయ్య మందిరం సహకారంతో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వేణుగోపాలరావు మాట్లాడుతూ చదువు అనేది పేజీలో ఉన్న అక్షరాలు కాదు మన జీవితాన్ని మార్చే ఆలోచనలు అని, విద్యార్థుల స్థితిగతులను ఉన్నతిని ఇచ్చేది చదువు ఒక్కటేనన్నారు. చదువుకొని ఉన్నత స్థితికి చేరిన వ్యక్తి ప్రభావం మూడు తరాలపైగా ఉంటుందన్నారు. కావున ప్రతి విద్యార్థి ఏకాగ్రత, శ్రద్ధ, లక్ష్యంపైన గురి ఉంచి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ జాన్ బెనియన్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనం అదుపు తప్పి యువకుడు మృతి

**నరసరావుపేట క్రైమ్,మార్చి 4 ప్రభాతవార్త :** మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో ద్విచక్ర వాహనం మీద వెళ్తూ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. పొలాలకు వెళ్ళిన గ్రామస్తులు రోడ్డు ప్రక్కన మృతదేహం పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుడు బొల్లాపల్లి మండలం రెడ్డిపాలెం గ్రామానికి చెందిన



పేరం మధు (35)గా గుర్తించారు. మృతుడు ద్విచక్ర వాహనం మీద వెళ్తూ దానిపై నుండి పడి మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారని తెలిసింది.

## పార్టీ కోసం ప్రాణాలను త్యజించిన త్యాగి తోట చంద్రయ్య: ఎమ్మెల్యే జూలకంటి

**మాచర్ల, మార్చి 4, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ కోసం, చంద్రబాబు నాయుడు కోసం ప్రాణాలను సైతం త్యజించిన త్యాగి దివంగత తోట చంద్రయ్య అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పునరుద్ఘాటించారు. ఏపీ



అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన పబ్లిక్ సర్వీసు నియామకాల సవరణ బిల్లుపై సాగిన చర్చలో ఆయన మాట్లాడారు. 2021లో టీడీపీ ఇన్‌ఛార్జిగా తనను ప్రకటించగానే, జరిగిన భారీ ర్యాలీ చూసిన వైసీపీ రక్కసి మూకలు ప్రతి మండలంలో పార్టీ నాయకులను చంపేందుకు పథకం రచించాయన్నారు. పిన్నెల్లి సోదరుల అనుచరులు ఒక పథకం ప్రకారం హత్య చేశారని, తోట చంద్రయ్య పీకపై కత్తిపెట్టినా... ఎక్కడా భయపడకుండా జై చంద్రబాబు అని ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. చంద్రయ్య మరణం బడుగు బలహీన వర్గాలను ఆలోచింపజేసిందని సీఎం చంద్రబాబు కూడా వారి కుటుంబాన్ని ఎంతగానో ఆదుకున్నారు.

**కఠిన శిక్షలతోనే ఫ్యాక్షన్ సమూల నిర్మూలన....**

కఠిన శిక్షలతోనే ఫ్యాక్షన్ సమూల నిర్మూలనకు దోహదపడుతోందని ఎమ్మెల్యే జూలకంటి అభిప్రాయపడ్డారు. పల్నాడులో అనాదిగా నెలకొన్న ఫ్యాక్షన్ రూపుమాపేందుకు సీఎం చంద్రబాబు అనేక మార్గాలను అన్వేషిస్తున్నారన్నారు. తోట చంద్రయ్య కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా ఆయన కుమారుడికి ఉద్యోగం ఇచ్చి, ఫ్యాక్షన్ ఊబిలో పడకుండా కాపాడారని ప్రశంసించారు. పబ్లిక్ సర్వీసు నియామకాల సవరణ బిల్లుకు అసెంబ్లీ, కేబినెట్ ఆమోదం తెలపడం శుభపరిణామమన్నారు. ఈ బిల్లుతో ఫ్యాక్షన్ కోరల్లో చిక్కుకునేందుకు ఏ ఒక్కరూ మొగ్గ చూపరని అభిప్రాయం వ్యక్తం చేశారు. బిల్లు ఆమోదానికి కృషి చేసిన సీఎం చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా జనసేన సభ్యత్వ నమోదు కేంద్రం ప్రారంభం

పిడుగురాళ్ల, మార్చి 4 ప్రభాతవార్త : జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదులో భాగంగా పిడుగురాళ్ల పట్టణంలోని బిస్మిల్లా స్టిక్కరింగ్ పాయింట్‌లో బుధవారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కేంద్రంను జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు



రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గురజాల నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అవినీతికి తావు లేకుండా కార్యకర్త సంక్షేమాన్ని కోరుకునే పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌కు భరోసాగా ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే వారి కుటుంబానికి భరోసాగా రూ. 5 లక్షలు భీమా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్, జిల్లా ప్రోగ్రాం కమిటి సభ్యులు దూదేకుల ఖాసీం, మండల ఉపాధ్యక్షుడు బయ్యవరపు రమేష్, బేతంచర్ల ప్రసాద్, గుర్రం కోటేశ్వరరావు, నకరికంటి నరసింహారావు, పెదకొలిమి కిరణ్, సింగంశెట్టి వెంకటరమణ, షేక్ గఫూర్, సిద్దెల సురేష్, నల్లమోతు సుబ్బారావు, గజ్జి సీతారామయ్య, షేక్ నాగుల్‌మీరా, దూదేకుల బాషా, గుంటూరు శ్రీను, షేక్ సైదా, తిప్పనబోయిన సూరి, షేక్ ఖాసీం, పవన్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్షరాంధ్ర పరీక్షలకు 3వేల మంది వయోజనులు హాజరు

**నిజాంపట్నం, మార్చి 4, ప్రభాతవార్త:** నిరక్ష్యరాసులైన వయోజనులు చదువుకునేందుకు ప్రభుత్వం అక్షరాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసిందని ఎంపిడిఓ నాగలక్ష్మీ తెలిపారు. బుధవారం మండలంలోని 15 పంచాయితీలలో అక్షరాంధ్రలో చదువుకున్న వయోజనులకు వయోజన విద్యాశాఖ ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించారు. పరీక్షలను ఎంపిడిఓ నాగలక్ష్మీ, ఎపిఎం మస్తాన్‌రావులు పరిశీలించారు. పరీక్షలకు సుమారు 3వేల మంది హాజరయ్యారని ఆమె తెలియజేశారు. మహిళలకు చదువుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో ఎపిఎం మస్తాన్‌రావు తదితదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## సిఎం సహాయంతో ఆర్థిక ప్రయోజనం

**భట్టిప్రోలు (రేపల్లె) మార్చి 4, ప్రభాతవార్త:** పేదల ఆరోగ్యం ప్రమాణాల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు.బుధవారం గుంటూరు క్యాంపు కార్యాలయంలో భట్టిప్రోలు మండలంలోని ఓలేరు గ్రామానికి చెందిన భలిజేపల్లి రవింద్రబాబుకు రూ.3 లక్షల 25 వేల 441 చెక్కును పంపిణీ చేసారు.అనారోగ్యంతో భాదపడుతూ ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్సకు అవసరమైన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు వెల్లడించారు.



## నిషేధిత భూములపై వేగం పెంచండి : సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి

**బాపట్ల, మార్చి 4. ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిషేధిత భూముల జాబితా నుంచి అర్హులైన వారి భూములకు పూర్తిస్థాయి హక్కులు కల్పించే ప్రక్రియను



రెవెన్యూ అధికారులు యుద్ధప్రతిపాదికన చేపట్టాలని సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి జయలక్ష్మి ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. బాపట్ల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో సాగులో ఉన్న వ్యవసాయ భూమి ఎం? అందులో నిషేధిత జాబితా (సెక్షన్ 22ఏ)లో ఎన్ని ఎకరాలు చిక్కుకున్నాయనే అంశంపై తక్షణమే సమగ్ర నివేదిక పంపాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపడాలిఅధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో నిర్దేశిత లక్ష్యాలతో పనిచేయాలని ఆమె సూచించారు. ముఖ్యంగా:పీజీఆర్ఎస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలను ఏమాత్రం జాప్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. **పారదర్శకత:** భూ వివాదాల పరిష్కారంలో పారదర్శకత పాటిస్తూ, సామాన్యులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు.ఈ వీక్షణ సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్ లవన్న, ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

## బిసిల సమస్యల సాధనకు ఉద్యమ కార్యాచరణ

**రేపల్లె,మార్చి 4, ప్రభాతవార్త:** బిసిల ప్రధాన డిమాండ్లపై విజయవాడలో భారీ సదస్సు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ నిర్ణయిస్తామని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు చెప్పారు.బుధవారం ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా బీసీల ప్రధాన సమస్యలను పరిష్కరించాలంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ వస్తున్నామని చెప్పారు.బీసీ విద్యార్థుల నిరుద్యోగుల వివిధ కుల సంఘాల,కార్మిక,ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోరుతూ అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహిస్తూ వస్తున్నట్లు చెప్పారు.రాష్ట్ర స్థాయిలో 50 ఏళ్ళు నిండిన బీసీలకు వృద్ధాప్య పెన్షన్,ప్రత్యేక రక్షణ చట్టం నుండి కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ,బీసీ సబ్‌ప్లాన్ మేరకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులతో పాటు స్థానిక సంస్థల నుండి చట్టసభల వరకు బీసీలకు రిజర్వేషన్లు జనాభా దామాషా మేరకు కేటాయించాలంటూ అందుకు జనగణనతో పాటు సమగ్ర కుల గణన జరపాలంటూ అనేక ఉద్యమాలు నిర్వహించామని చెప్పారు. జాతీయ స్థాయి బీసీల పోరాటాల ఫలితంగానే నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కులగణనకు పూనుకుందన్నారు.చట్టబద్ధ రాజకీయ రిజర్వేషన్లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ంతవరకు బీసీల సామాజిక న్యాయ ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని శంకరరావు చెప్పారు.దీనిలో భాగంగా బీసీల ప్రధాన సమస్యలపై ఎన్నికల సంఘ నాయకులతో విస్తృతంగా చర్చించేందుకు రాష్ట్ర స్థాయి భారీ సదస్సును విజయవాడలో త్వరలో నిర్వహిస్తామని తెలిపారు.



## మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

### ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల , మార్చి 4, ప్రభాతవార్త:** విద్యార్థినులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు, విద్యాసంస్థల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. బుధవారం బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.డిగ్రీ కళాశాల గదుల్లో బాలికల ఉన్నత పాఠశాల తరగతులు నిర్వహించడంపై కలెక్టర్ ఆరా తీశారు. గదుల కొరత కారణంగా గతంలోనే ఈ ఏర్పాటు చేసినట్లు సిబ్బంది వివరించగా, పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం మధ్యలోనే ఎందుకు నిలిచిపోయిందని అధికారులను ప్రశ్నించారు. దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్.. విద్యాశాఖ రాష్ట్ర స్థాయి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, నిలిచిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఆధునికీకరణకు హామీ..**

జూనియర్, డిగ్రీ కళాశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను, విద్యార్థినుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్న ఆయన.. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. "కళాశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తానన్నారు. గదులను ఆధునీకరిస్తామనీ



విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

**నాణ్యమైన బోధన అందాలి...**

చదువుతో పాటు ప్రయోగాత్మక విద్యపై దృష్టి సారించాలన్నారు. బోధన నాణ్యతగా ఉండాలని, ప్రాక్టికల్స్ క్రమ పద్ధతిలో నిర్వహించాలని కళాశాల సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు.ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఆర్డీఓ పి.గ్లోరియా, డీఈఓ శ్రీనివాస్ సింగ్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహశీల్దార్ షాలీమా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నాగమణి పాల్గొన్నారు.

## సైబర్‌నేరాల పై అప్రమత్తంగా ఉండాలి

**రేపల్లె,మార్చి 4, ప్రభాతవార్త:** సమాజంలో సైబర్ నేరాలు పెరిగినందున ప్రజలు అప్రత్తంగా ఉండాలని రేపల్లె ఐసీడిఎస్ ప్రాజక్ట్ సిడిపిఓ ఎం.సుచిత్ర అన్నారు.బుధవారం రేపల్లె పట్టణంలోని ఆంధ్ర రత్న,శివాజీ పాఠశాలల్లో మిషన్‌శక్తి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు,విద్యార్థులకు స్వయం సహాయక సంఘాల



సభ్యులకు సైబర్ నేరాలు,ఆర్థిక సాధికారత అంశాలపై అవగాహన కల్పించారు.సోషల్ మీడియా వినియోగంలో అనుమానస్పద లింక్‌లకు,అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు.వ్యక్తి గత సమాచారం అపరిచితులతో పంచుకోరాదని ఆమె సూచించారు.

## వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్తగా నాగమోహనకృష్ణ

**రేపల్లె,మార్చి 4, ప్రభాతవార్త:** రేపల్లె నియోజకవర్గానికి చెందిన పీతా నాగమోహన్‌కృష్ణను వైసీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం నియమించింది.వైసీపీ రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శిగా కొనసాగుతున్న తరుణంలో రేపల్లె నియోజకవర్గ బాధ్యతలను నాగమోహన్‌కృష్ణకు అప్పగించింది.తన తాత పీతా పోతురాజు స్మారకార్థ మెమోరియల్‌ట్రస్ట్‌ను స్థాపించి నియోజకవర్గ స్థాయిలో సేవా కార్య క్రమాల నిర్వహణ ద్వారా ప్రజలతో సన్నిహిత సంభంధాలు ఉన్నట్లు భావించిన అధిష్టానం నాగమోహన్‌కృష్ణకు అవకాశం కల్పించింది.ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పార్టీ నాయకత్వానికి,కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేస్తానని నాగమోహన్‌కృష్ణ హామీ ఇచ్చారు.



## ఎంపిక చేసిన ఐదు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

**బాపట్ల, మార్చి 4, ప్రభాతవార్త:** జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం ఖీసూర్య ఘర్ఖీను సమర్థవంతంగా అమలు చేసి, ఐదు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్



వినోద్ కుమార్.వి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సిపిడిసిఎల్ అధికారులతో పథకం అమలు తీరుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన లక్ష్యాల మేరకు 24,620 గృహాలకు సౌర విద్యుత్ కనెక్షన్లు అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు.. ప్రతి నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి, అక్కడ వంద శాతం సౌర విద్యుత్ ఉత్పత్తి మరియు వినియోగం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు

**ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాలు ఇవే..**

జిల్లాలో ప్రాథమికంగా కింది గ్రామాలను సూర్య ఘర్‌ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. పిట్టలవానిపాలెం (పిట్టలవానిపాలెం మండలం),కొత్తపేట (వేటపాలెం మండలం),కారంచేడు (కారంచేడు మండలం),కనగాల (చెరుకుపల్లి మండలం),యడ్లపల్లి (చుండూరు మండలం), కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అద్భుత పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, సౌర విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఆంజనేయులు, భూగర్భ గనుల శాఖ డిడి జి.శ్రీనివాస్, డీఈలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేరు మార్పు : ఎంపీడీవో

**నగరం, మార్చి 4, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేసి వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్



రోజ్ గార్ అండ్ ఆజీవిక మిషన్ మార్పు చెందని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏప్రిల్ ఒకటి నుంచి వి బి జి రాంజీ పేరు మారుస్తున్నట్టు తెలిపారు. గతంలో ఉపాధి హామీ పథకంలో ఒక కుటుంబానికి సంవత్సరానికి 100రోజుల పని కల్పించడం జరిగిందని, ఈ కొత్త చట్టంలో ఒక కుటుంబానికి 125 రోజులు పని కల్పించడం జరుగుతుందన్నారు. గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల 90: 10 భరించేవని, ఇకనుండి 60: 40 ఉండడం జరుగుతుందన్నారు. వ్యవసాయ పనులు జరిగే సమయంలో రైతులకు వెసులుబాటు కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఉపాధి హామీ శ్రామికులకు ఇచ్చే జాబ్ కార్డులను ఇకనుండి గ్రామీణ రోజ్ గార్ హామీ కార్డులుగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇకనుంచి ఈ పథకంలో లోపాలను వికసిత్ గ్రామ ప్రణాళిక ద్వారా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఒంటరి మహిళలు ,వికలాంగులు ,60 సంవత్సరాల పైబడిన వారు కి ప్రత్యేకంగా వివిధ కేటగిరీలుగా పని చేసుకునేందుకు చట్టంలో వెసులుబాటు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ కొత్త చట్టాలను ఉపయోగించుకోవాలని, అర్హులైన గ్రామీణ ప్రాంత ప్రజలందరూ ఈ కొత్త చట్టాలను ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కోటయ్య నాయక్, టీఏ స్టాలిన్, ఆశీర్వాదం, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నులు వసూలు వేగవంతం చేయాలి

### -ఎంపీడీవో రవికుమార్

**వేమూరు మార్చి 4 (ప్రభాతవార్త) :** గ్రామ పంచాయితీల్లో ఇళ్ళ పనుల వసూళ్ళను పంచాయితీ సిబ్బంది వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో రవికుమార్ తెలియజేశారు. బుధవారం మండలంలోని చదలవాడ, కుచ్చెళ్ళపాడు, వరహాపురం, గ్రామాల్లో పన్నుల వసూళ్ళపై ఎంపీడీవో



రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవోలు కోటేశ్వరరావు, సుభాష్ చంద్రబోస్‌లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామాలలో పంచాయితీ పనుల వసూళ్ళ ప్రత్యేక కార్యచరణ రూపొందించి పన్నుల వసూళ్ళ ప్రత్యేక కార్యచరణ రూపొందించి పన్నుల వసూళ్ళు నూరు శాతం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో తామే నేరుగా పర్యటించి సిబ్బందికి తగు సూచనలు ఇవ్వటం జరుగుతుందని ఎంపీడీవో రవికుమార్ వివరించారు. గ్రామస్తులు వసూళ్ళకు పంచాయితీ సిబ్బందికి సహకరించి త్వరితగతిన పన్నులు చెల్లించాలని తెలియజేశారు.

## నిర్దేశిత గడువులోగా ప్రాజెక్టులు పూర్తి కావాలి

### కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశం

**బాపట్ల, మార్చి 4 ప్రభాతవార్త:** జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి, రైల్వే ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో నిర్వహించిన వారాంతపు అభివృద్ధి పనుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సి.ఎం.డి.ఎస్ నియోజకవర్గాల వారీగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఓడరేవు–చిలకలూరిపేట జాతీయ రహదారి పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. ఈ మార్గంలో నిర్మాణంలో ఉన్న వంతెనలు, ఆర్‌ఓబీలు . మేజర్ మరియు మైనర్ జంక్షన్ల పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కారంచేడు–పర్చూరు టోల్ గేట్ వద్ద మరో రెండు రోజుల్లో టోల్ వసూళ్ల ప్రారంభం కానున్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రహదారి పొడవునా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.జిల్లాలో సాగుతున్న రైల్వే



పనుల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, పనుల నాణ్యతలో రాజీ పడకుండా గడువులోగా పూర్తి చేయాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బి డీఈ అరుణ, సీపీవో సాల్మన్ రాజు, కలెక్టరేట్ ఏవో మల్లికార్జున, భూసేకరణ అధికారి శ్రీలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల

## 57వ వార్షికోత్సవ వేడుకలు

**నగరం , మార్చి 4, ప్రభాతవార్త:** ప్రతి విద్యార్థికి క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. గంగాధర్ అన్నారు. బుధవారం శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో 57 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య నేర్చుకుని సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దుకోవాలి అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ కళాశాలకు సేవలు అందించిన పూర్వపు విద్యార్థులను స్మరించుకున్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నతంగా ఎదగాలని తమ కళాశాలలో ఉన్నటువంటి సౌకర్యాలు ఉపయోగించుకుని విద్యతో తో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. ఇటీవల నేషనల్, ఇంటర్నేషనల్ లో విద్యార్థులు పథకాలు సాధించారని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ కళాశాలలో అకడమిక్ రిపోర్టును ,అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ, భవిష్యత్తులో ఆసరా కల్పించే విధంగా అనేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులతో సత్కరించి నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరిగింది. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకమండలి సభ్యులు కె.వి రమణమూర్తి, స్టూడెంట్స్ యూనియన్ చైర్మన్ బి. బాలసుబ్రమణ్యం , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘ నూతన భవనం ప్రారంభం

**తెనాలి మున్సి పాలిటీ మార్చి4,(ప్రభాతవార్త):** పట్టణంలోని కొత్తపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘ నూతన భవనం (కాంప్లెక్స్) ప్రారంభోత్సవాన్ని,బుధవారం విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్, సీనియర్ వైద్యులు,సంఘ నాయకులు డాక్టర్



వజ్రాల శివకుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘం నూతన భవనాన్ని దాతలు సంఘీయులు సహకారంతో మరియు ప్రముఖ వైద్యులు సంఘ నాయకులు డాక్టర్ వజ్రాల శివకుమార్ సహకారంతో నూతన భవనాన్ని నిర్మించుకొని సంఘీయులకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం నూతనభవనం(కాంప్లెక్స్) ప్రారంభోత్స వానికి విచ్చేసిన సంఘ పెద్దలు కమిటీ సభ్యులు శ్రేయోభిలాషులు మరియు స్నేహితులకి అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గుంటముక్కల వెంకట నాగార్జున,ప్రధాన కార్యదర్శి కడియం శేషబాబు, సహాయ కార్యదర్శి అనుపోజు గిరి మరియు కోశాధికారి తుమ్మపాల లక్ష్మీ ప్రసాద్‌లు తెలిపారు.

## సముద్రంపై సిరి పండించండి.!

### సముద్ర మొక్కల యూనిట్‌ను పరిశీలించిన బాపట్ల కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల.మార్చి 4, ప్రభాతవార్త:** సముద్రపు మొక్కల సాగుతో మత్స్యకార మహిళల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, వారి తలసరి ఆదాయం గణనీయంగా పెరుగుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు.బుధవారం మండలంలోని పెద్దగంజాం ఏటుమెగ గ్రామంలో రాష్ట్రంలోనే ప్రయోగాత్మకంగా చేపట్టిన సముద్ర



మొక్కల పెంపకం యూనిట్‌ను ఆయన సందర్శించారు. సాగు విధానం, మార్కెటింగ్ సౌకర్యాలు, మహిళా మత్స్యకారులు పొందుతున్న లాభాలపై ఆరా తీశారు.

**ఔషధ గని.. సముద్ర మొక్క..**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి పంట మాదిరిగానే సముద్రంపై ఈ సాగు చేయడం అభినందనీయమన్నారు. "ఈ మొక్కల్లో అత్యధిక పోషక విలువలు, ఔషధ గుణాలు ఉన్నాయి. కేవలం 45 రోజుల్లోనే పంట చేతికి వస్తుంది. ఆహార పదార్థాలు, మందుల తయారీలో వీటికి విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో, సెర్ప్ ద్వారా మహిళలకు అవసరమైన పెట్టుబడి నిధిని ప్రభుత్వం అందిస్తుందని, ముఖ్యంగా చేపల వేట నిషేధ సమయంలో ఈ సాగు మత్స్యకార కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందన్నారు.

**పరిశోధనల్లో అద్భుత ఫలితాలు: శాస్త్రవేత్త సతీష్...**

కేంద్ర ప్రభుత్వ సీఎంసీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ మాట్లాడుతూ.. పెద్దగంజాం తీరంలో జరిపిన పరిశోధనల్లో ఈ మొక్కల ఉత్పత్తి వేగంగా ఉందని తేలిందన్నారు.ఒక యూనిట్ ద్వారా ప్రస్తుతం 50 టన్నుల ఉత్పత్తి సాధించారన్నారు.మార్కెట్‌లో టన్ను ధర సుమారు రూ.50 వేల వరకు పలుకుతుందన్నారు.8 మీటర్ల పొడవున్న 8 ప్లాస్టిక్ పైపులతో గడులు ఏర్పాటు చేసి, ట్యూబ్ నెట్ల ద్వారా సాగు చేయడం జరిగిందన్నారు.ఈ మొక్కల నుండి "కప్పాఫైకస్ బయో ఫార్ములా, "కరాజీన్నా వంటి విలువైన పదార్థాలు లభిస్తాయన్నారు.

ప్రస్తుతం ఇక్కడ 32 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని, ఒక మహిళా 8 క్లస్టర్ల వరకు సాగు చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.సింగయ్య, చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్, తహశీల్దార్, ఎంపీడీవో, ఏపీఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## పబ్బిశెట్టి సత్యకుమార్‌కు కొల్లూరులో ఘన సన్మానం

**కొల్లూరు, మార్చి 4 (ప్రభాతవార్త) :** ఇటీవల విజయవాడలో అంబికా కృష్ణ చేతుల మీదుగా వభవ్ సామ్రాట్ అవార్డు అందుకున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బిశెట్టి సత్యకుమార్‌కు కొల్లూరులో బుధవారం సాయంత్రం మైత్రి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘన సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కుర్ర సత్యనారాయణ, మండల పరిషత్ మాజీ వైస్ ప్రెసిడెంట్ గొరికపూడి ప్రసాద్, బిజెపి నాయకులు గోగినేని చంద్రశేఖరరావు, పెదపూడి నాగరాజు, తెలుగుదేశం పార్టీ బీసీ సంఘ నాయకులు డాక్టర్ దావులూరి ఏడుకొండలు, రిటైర్డ్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ మేడికొండ అనిల్‌కుమార్, ఆర్ఎంపి డాక్టర్ ఏటుకూరి వరప్రసాద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు భరత్, కిషోర్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



# మహిళ ఆర్థిక స్వాలంబన దిశగా కూటమి ప్రభుత్వం

## తెదేపా నాయకురాలు వాణి

**వట్టిచెరుకూరు, మార్చి 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళా ఆర్థిక స్వాలంబన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు యడ్లపల్లి వాణి అన్నారు. అసెంబ్లీలోని ముఖ్యమంత్రి చాంబర్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని బుధవారం ప్రత్తి పాడు నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు ఎడ్లపల్లి వాణి మర్యాద పూర్వకంగా కలిశారు. మహిళాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని వెల్లడించారు. మహిళా దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన విప్లవాత్మక మహిళా సంక్షేమ, సాధికారత పథకాలపై ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.



మహిళలను కేవలం వంటింటికే పరిమితం చేయకుండా, వారిని ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లే దృఢ సంకల్పంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని వివరించారు. ముఖ్యంగా మహిళల విద్య, వివాహ భద్రత, ఉపాధి, డిజిటల్ సాధికారత మరియు ఆరోగ్య పరిరక్షణ వంటి కీలక రంగాలకు పెద్దపీట వేస్తూ ప్రవేశపెట్టిన పథకాలు మహిళా లోకానికి కొండంత అండగా నిలుస్తాయనే ధీమా వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ విద్యాలక్ష్మి మరియు ఎన్టీఆర్ కల్యాణలక్ష్మి పథకం, పేద విద్యార్థినులకు విద్యను, యువతులకు వివాహ భద్రతను అందించే పథకాల అమలు, మహిళలకు ఉచిత స్మార్ట్‌ఫోన్ల పంపిణీ ద్వారా ఆధునిక సాంకేతికతను చేరవ చేయడం, ఉచిత కుట్టు యంత్రాల పంపిణీ, నైపుణ్య శిక్షణ మరియు మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, బాలికలు మరియు మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకుంటున్న ప్రత్యేకంగా సీఎంతో చర్చించారు.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో మహిళా సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో స్థానిక శాసనసభ్యులు రామాంజనేయులు సమన్వయం, సహకారం ఎంతో కీలకమని ఆమె వివరించారు. మహిళల శక్తివంతీకరణ ద్వారానే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి గారు విశ్వసిస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి అర్హురాలికి చేరేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# మానవత్వం చాటుకున్న సహచర విద్యార్థులు

**వట్టిచెరుకూరు, మార్చి 4, ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ అనారోగ్యం పాలైన విద్యార్థికి సాటి విద్యార్థులు ఆర్థిక సహకారం అందించి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకెళ్తే మండలంలోని వింజనంపాడు గ్రామం వద్దనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్య నభ్యసిస్తున్న ఓ విద్యార్థి ఆర్థిక ఇబ్బందులతో




తన విద్యను కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. దీనిని గ్రహించిన ఎన్ఎస్ఎస్ సెల్, సిఎస్ఈ విభాగం విద్యార్థులు స్పందించి ఆ విద్యార్థికి రూ.35వేలు ఆర్థిక సహకారం అందించి మానవత్వం సాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. కోయి సుబ్బారావు మాట్లాడుతూ.. అవసర సమయంలో విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఎన్ఎస్ఎస్, సిఎస్ఈ విద్యార్థినీ విద్యార్థులు సేవాస్ఫూర్తి, సహకారం మరువలేనివని చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డా.పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం హెచ్‌ఓడి ఆర్.రమేష్, మరియు సిఎస్ఈ ఫ్యాకల్టీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# మహా పూర్ణాహుతితో ముగిసిన 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు

**గుంటూరు కల్చరల్, మార్చి 4, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో గుంటూరు తిరుమలగా ప్రసిద్ధిగాంచిన శ్రీపద్మావతి గోదా



సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి 27వ వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్ణాహుతితో ముగిసాయి. ఆలయ ప్రధానార్చకులు పరుచూరి మాధవ స్వామి, పరాశరం కృష్ణప్రసాద్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హోమ కార్యక్రమాల్లో నిత్యపూజలు చూర్ణోత్సవం, అవబృధోత్సవం విశేషంగా నిర్వహించారు. శ్రీవిరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు, హంపి విద్యారణ భారతీ స్వామివారి కరకమలములతో మహాపూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొదటి రోజు నుండి హోమాల్లో పాల్గొన్న దంపతులు కలశాలతో ఊరేగింపుగా స్వామివద్దకు చేర్చి ఆరాధన చేశారు. రుత్విక్కులు ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు విశేష అన్న సంతర్పణ జరిగింది. ఆలయ సత్సంగ్ గోష్టి, లలిత, విష్ణు సహస్ర నామ పారాయణాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య మాట్లాడుతూ కార్యక్రమాలు విజయ వంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. భారతీ ధార్మిక విజ్ఞానపరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్య నారాయణ, ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు లంక విజయబాబు, సూర్యదేవర వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, పుట్టగుంట ప్రభాకరరావు, తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# నేత్రపర్వంగా శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం

**గుంటూరు కల్చరల్, మార్చి 4, ప్రభాతవార్త :** స్థానిక అరుండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం విశేషంగా పాల్గొన్న దంపతుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా కనకాంబరాలు, మల్లెలు, తులసీ మాలలతో కళ్యాణమూర్తులను విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామి కరకమలములతో పుష్పాభిషేకం నిర్వహించి, ప్రత్యేక హారతులతో కళ్యాణ మూర్తులను సేవించారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు, విశేషంగా తరలి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను స్వామివారు అందించారు. ఉదయం నిత్యపూజలు, శ్రీచక్రమేరుకు విశేషాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ గురువారం ఉదయం శ్రీ లక్ష్మీనారాయణులకు అభిషేకం, కళ్యాణం శాంతిహోమం మహాపూర్ణాహుతి జరుగుతాయని అన్నారు.

# పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించిన మున్సిపల్ కమీషనర్

**తెనాలి మున్సిపాలిటీ మార్చి4, (ప్రభాతవార్త):** మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు బుధవారం పట్టణం లోని 25,28 వార్డు లలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. 25వ వార్డులో పినపాడు చెరువు సమీపంలో పిన్నులపేట కాలువలో నీరు పారుదల కావడం లేదని, వచ్చిన ఫిర్యాదును పరిశీలించేందుకు వచ్చి, కాలువను వెంటనే శుభ్రం చేయించాలని సానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాదును ఆదేశించారు. కాలువలో నీరు పారుదల కాకపోవడానికి గల కారణాలను



పరిశీలించి, సమస్యను వెంటనే పరిష్కరించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. పినపాడు చెరువు పరిసర, ప్రాంతాలను పరిశీలించిన కమీషనర్ కాలువలో పూడికను తీయించి, దోమల నివారణ మందును చల్లించారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల నుండి వచ్చే పారిశుద్ధ్య ఇతర సమస్యలపై ఫిర్యాదులను అశ్రద్ధ చేయకుండా వెంటనే స్పందించాలని ఆయన సూచించారు. అనంతరం శాంతినగర్ రైల్వే గేటు వద్ద ఉన్న రైల్వే కల్వర్టును పరిశీలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మొవ్వ యేసు బాబు, బుధవారం 32వ వార్డు లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. వార్డులలో జరుగుతున్న చెత్త సేకరణపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సానిటరీ ఇన్స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్ సానిటరీ సెక్రటరీలు ఏమినిటి సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల"చలో విజయవాడ" కార్యక్రమంలో తెనాలి నేతలు

**తెనాలి టౌన్ మార్చి4, (ప్రభాతవార్త):** రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికై బుధవారం చలో విజయవాడ" కార్యక్రమంలో, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఫ్) గుంటూరు జిల్లా, తెనాలి నియోజకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వేలాదిగా పాల్గొని విజయవాడ నగరంలోని ఇందిరాగాంధీ




మున్సిపల్ స్టేడియం వద్ద నుండి రాఘవయ్య పార్కు మీదుగా తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్దకు భారీ ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం నిర్వహించిన సభకు రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు తమ న్యాయమైన డిమాండ్లను మంత్రికి వివరించారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ జర్నలిస్టుల ఇంటి కల నెరవేరలేదని, ఇళ్ల స్థలాలు, కేటాయింపులో నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రమాద భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్న విధంగా పెన్షన్ పథకం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. మీడియా హక్కుల పరిరక్షణకు ప్రత్యేక మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, కార్పొరేట్ సంస్థల ద్వారా జర్నలిస్టులకు ఉచిత విద్య, వైద్యం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమాజం కోసం నిరంతరం శ్రమిస్తున్న జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి కుటుంబాల భద్రత, సంక్షేమం కోసం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే దశల వారీగా ముఖ్యమంత్రి సహా పలువురు ప్రముఖులకు వినతిపత్రాలు అందజేశామని, ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న ఈ తరుణంలో మరోసారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు నేడు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ, జర్నలిస్టుల న్యాయబద్ధమైన డిమాండ్లను వారికి కల్పించవలసిన సౌకర్యాలను సంబంధిత అధికారులతో చర్చించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన వారు కోరుకున్నట్లు వారికి అందవలసిన సౌకర్యాలు గాని ఇంటి స్థలాలు గాని హెల్త్ కార్డులు గానీ ఇతరత్రా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని జర్నలిస్టులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ ఎపిడబ్ల్యూజెఎఫ్ అధ్యక్షులు అంబటి శ్యామ్ సాగర్, కార్యదర్శి అచ్యుత సాంబశివరావు, రాష్ట్ర నాయకులు కనపర్తి రత్నాకర్, ఎస్ఎస్.జహీర్, దొండపాటి కోటేశ్వరరావు, శ్రీరాం సుభాష్ బాబు, అత్తోట సంజయ్, శేషం ప్రదీప్, జవంగుల వెంకట సిద్ధార్థ, కోడూరు నాగరాజు, మునిపల్లి శ్రీకాంత్, చింతా మణికుమర్‌లు పాల్గొన్నారు.

# కనుల పండువగా శ్రీధనలక్ష్మీ నారాయణుల కళ్యాణం

**గుంటూరు కల్చరల్, మార్చి 4, ప్రభాతవార్త :** స్థానిక అరుండల్‌పేట శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం వారి 31వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు మర్రిపాటి ప్రసాద్, వారి బృందం ఆధ్వర్యంలో శ్రీధనలక్ష్మీ నారాయణుల కళ్యాణం వివిధ రకాల పుష్పాలు, సుగంధ



ద్రవ్యాలతో ప్రత్యేకంగా తులసీ మాలలతో కళ్యాణమూర్తులను, అష్టలక్ష్ములను అలంకరించి, ధనలక్ష్మీ అమ్మవారి కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. శ్రీవిరూపాక్ష విద్యారణ్య పీఠాధిపుతులు విద్యారణ్య భారతస్వామి వారు కళ్యాణ మూర్తులకు విశేష పుష్పాభిషేకం, ప్రత్యేక హారతి నిర్వహించి కళ్యాణంలో పాల్గొన దంపతులకు తీర్థప్రసాదాలను అందించారు. ఉదయం నిత్యపూజలు, శ్రీచక్ర మేరుకు విశేషాభిషేకాలు నిర్వహించారు.

# యుద్ధ జ్వాలల ప్రకోపాన్ని ఆపేందుకు అన్ని దేశాలు ముందుకు రావాలి

**గుంటూరు కల్చరల్, మార్చి 4, ప్రభాతవార్త :** పశ్చిమాసియాను పెనుఉద్రిక్తల పాల్జేసి ప్రపంచ సౌభాగ్యానికి హానికరంగా పరిణమించే యుద్ధజ్వాలల ప్రకోపాన్ని అడ్డుకునేందుకు అన్ని దేశాలు ముందుకు రావాలని, చర్చల ద్వారా శాంతి స్థాపనకు ప్రయత్నించాలని అవగాహన సంస్థ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వక్తలు విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో పశ్చిమాసియా రావణకాష్టం-అన్ని దేశాలపై ప్రభావం అన్న అంశంపై చర్చజరిగింది. విద్యావేత్త, విశ్లేషకులు చంద్రయ్య మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయేల్ లు ఇరాన్‌పై దండెత్తడం, ఇరాన్ కూడా తగ్గేది లేదని తేల్చిచెప్పటంతో ప్రపంచశాంతికి వినాశనమైన మరోయుద్ధం తప్పేలా లేదన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నా యన్నారు. అమెరికా ఇజ్రాయేల్ గుమ్మరించిన బాంబుల దాటికి ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ మరణించడం పశ్చిమాసియాను కల్లోలం లోకి నెట్టేసిందన్నారు. జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వి.వి.రావ్ మాట్లాడుతూ ఈ యుద్ధం ఇరాన్ భవితవ్యాన్ని ఎలాంటి మలుపు తిప్పుతుందనేది ప్రస్తుతానికి ప్రశ్నార్ధక మవుతుందన్నారు. యుద్ధం దీర్ఘకాలం జరిగితే భారత్ లాంటి దేశాలకు నష్టం తప్పదన్నారు. సమావేశంలో రాడికల్ హ్యూమనిస్టు చంద్రశేఖర్, బసవగుప్తా తదితరులు ప్రసంగించారు.

# విద్యార్థులు మంచి భాషను అలవర్చుకోవాలి

## గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**మంగళగిరి, మార్చి 4, ప్రభాతవార్త :** విద్యార్థులు సంస్కారవంతమైన మంచి భాషను అలవర్చుకోవాలనీ, మంచి వాక్చాతుర్యం వల్ల ఉత్తను నాయకుడిగా ఎదిగే అవకాశం ఉందని గాజువాక శాసన సభ్యులు, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా



శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏర్పాటు చేసిన ఆసెంబ్లీ సందర్శన కార్యక్రమానికి విశాఖపట్నంలోని పెన్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం ఉదయం ఈ స్కూలుకు చెందిన 120 నుంది విద్యార్థులు, టీచర్లు వెలగపూడిలోని ఆంధ్ర ప్రదేశ్ అసెంబ్లీని సందర్శించారు. అసెంబ్లీలో జరిగే ప్రశ్నోత్తరాలు కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అసెంబ్లీలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగాన్ని ఆలకించారు. ఈ సందర్భంగా గాజువాక, విశాఖ సౌత్, అనక పల్లి శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వంశీ కృష్ణ శ్రీనివాస్, కొణతాల రామకృష్ణలతో అసెంబ్లీ ఎదుట విద్యార్థులు ఫొటోలు దిగారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చదువుతోపాటు మంచి సంస్కారాన్ని, స్పీకింగ్ స్కిల్స్ను అలవర్చుకోవాలని, అప్పుడే అన్నింటా రాణింపు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలంటే మంచి భాషానై పుణ్యం తప్పని సరని హితవు చెప్పారు. విశాఖపట్నం నుంచి అసెంబ్లీని చూసేందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో పాటు పెన్ స్కూలు ఉపాధ్యాయులు భవ్య, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి అడ్మిషన్స్ విభాగం మేనేజర్ శిరీష పాల్గొన్నారు.

# వైకాపా సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌ను అరెస్టు చేసిన తెనాలి రూరల్ పోలీసులు

**తెనాలి టౌన్ మార్చి4(ప్రభాతవార్త):** సామాజిక మాధ్యమాలలో అసభ్యకరమైన, అసత్యమైన, రెచ్చగొట్టే విధమైన వ్యాఖ్యలు పోస్ట్ చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, తెదేపా' సోషల్ మీడియా విభాగానికి చెందిన ఒక మహిళ యొక్క గౌరవాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ఆమె ఫొటోను అభ్యంతరకర వ్యాఖ్యతో జోడించి, ప్రచారం చేసిన వైఎస్ఆర్సీపీ సోషల్ మీడియా కార్యకర్తను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించిన తెనాలి రూరల్ పోలీసులు. పోలీసుల కథనం ప్రకారం, తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన టిడిపి పార్టీ మహిళా కార్యకర్త అయిన జెట్టి రేణుక గురించి, సామాజిక మాధ్యమాల్లో తన ఫొటోను దొంగిలించి, అభ్యంతర వాక్యను జోడించి, తన ప్రతిష్ఠకు భంగం కలిగించేవిధంగా ప్రచారం చేస్తున్నాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, బాపట్ల పట్టణానికి చెందిన షేక్ సయ్యద్ (47), అనే వ్యక్తి ఫిర్యాదియైన మహిళ ఫొటోను అభ్యంతర వ్యాఖ్యను జోడించి, ప్రచారం చేశాడని కనుగొనబడింది. కావున షేక్ సయ్యద్ ను బుధవారం, నందివెలుగు జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా, అతను తను చేసిననేరాన్ని అంగీకరించగా, అతన్ని అరెస్టు చేసి గౌరవ కోర్టు ముందు హాజరు పరచడమైనదని రూరల్ సిఐ షేక్ నాయబ్ రసూల్, ఎస్ఐ ఆనంద్ లు తెలిపారు. నిందితుడు షేక్.సయ్యద్ మొదటి నుండి వైఎస్సార్‌సీపీ పార్టీకి మద్దతుదారుడిగా ఉండి, ప్రస్తుతం బాపట్ల మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నాడని, సుమారు ఒక సంవత్సరం క్రితం, 15 సెప్టెంబర్ 2022న తన మొబైల్ నంబర్ 9094515555 ఉపయోగించి "గచ్చిబౌలి దివాకర్".. అనే పేరుతో ఫేక్ ఫేస్‌బుక్ ఖాతాను సృష్టించి, ఫేక్ ప్రొఫైల్ పిక్చర్‌ను పెట్టి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మరియు టిడిపి, జనసేన వంటి పార్టీల నాయకులపై వ్యతిరేక పోస్టులు పెట్టటమే కాకుండా, ఫోటోలు మార్ఫింగ్ చేసి, రెచ్చగొట్టే ట్యాగ్‌లైన్‌లు జోడించి పోస్టులు చేయడంతో పాటు, అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలను షేర్ చేసేవాడని పోలీసులు తెలిపారు. ఫిర్యాదిదారు తనను అనుసరించే సోషల్ మీడియా కార్యకర్తల ద్వారా ఆ పోస్టులను విస్తృతంగా షేర్ చేయించి రాష్ట్రవ్యాప్తంగా వ్యాప్తి చెందేలా చేసాడు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడం, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టడం, వర్గాల మధ్య విభేదాలు సృష్టించడం మరియు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి ఉద్దేశంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించినట్లు దర్యాప్తులో వెల్లడైనదని, వారు తెలిపారు. అంతేకాకుండా నిందితుడిపై, వివిధ పోలీస్ స్టేషన్లలో మొత్తం 7 సోషల్ మీడియా వైలేషన్ కేసులు నమోదు చేయబడినవని, చింతలపూడి, బాపట్ల టౌన్, కొత్తపట్నం, పులివెందుల, హిర మండలం, న్యూ పోర్ట్, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్లో నిందితుడిపై 7కేసులు నమోదైనవని, అనంతరం అతని ఫేక్ ఫేస్‌బుక్ ఖాతా నిలిపివేయగా,



తదుపరి తన పేరుతో "షేక్ సయ్యద్ అనే కొత్త ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి, "జగనన్న సైన్యం బాపట్ల నియోజకవర్గం".. మరియు "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వార్తలు".. వంటి వాట్సాప్ గ్రూపుల్లో సోషల్ మీడియా పోస్టులు పెడుతూ, వాటిలో కొన్నింటిని ఎడిట్ చేసి తన ఫేస్‌బుక్ ఖాతాలో ప్రచురిస్తూ వచ్చాడని, అదే విధంగా ఇటీవల తిరుమల-తిరుపతి దేవస్థానం ప్రస్తుత చైర్మన్ బి. ఆర్.నాయుడు కి సంబంధించిన వీడియో వైరల్ అయిన సందర్భంలో, ఆ వీడియోలో ఉన్న మహిళ తెనాలికి చెందిన జెట్టి.రేణుక అని ప్రచారం చేసేందుకు ఆమె ట్విట్టర్ ఖాతా నుండి ఆమె ఫొటోను దొంగిలించి, "తొందరలో" అనే అభ్యంతర వ్యాఖ్యను ఆమె ఫొటోకు జోడించి, ది.02.03.2026న తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేసాడని, సదరు మహిళ గతంలో ఉమ్మడి గుంటూరు జిలా తెదేపా సోషల్ మీడియాలో యాక్టివ్ ఉంటూ, వైఎస్ఆర్సీపీ పార్టీ వారిని విమర్శిస్తూ ఉండేదని, కావున ఆమెను లక్ష్యంగా చేసుకుని, ఆమెను అప్రతిష్టకు గురిచేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలినదని, తెనాలి రూరల్ సీఐ నాయబ్ రసూల్, రూరల్ ఎస్సై ఆనంద్ వెల్లడించారు. అరెస్టు చేసిన షేక్ సయ్యద్‌ను రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచగా, పోలీసుల తరఫున సీనియర్ ఎపిపి పరిసపోగు సునీల్ కుమార్ వాదనలు వినిపించగా, న్యాయమూర్తి పలగాని రాజశేఖర్ సదరు ముద్దాయికి 14 రోజుల రిమాండ్ విధించగా, అతనిని, గుంటూరు జిల్లా జైలుకి కు తరలించడమైనదన్నారు. ఈ సందర్భంగా సిఐ నాయబ్ రసూల్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేసి అసత్య ప్రచారం, అసభ్యకర పోస్టులు చేయువారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు.

# చిత్తశుద్ధితో పనిచేయండి ప్రజల మన్ననలు పొందండి

## -ఎంపిపి పద్మావతి

**కొల్లిపర, మార్చి 4, ప్రభాతవార్త:** ప్రతి అధికారి కూడా చిత్తశుద్ధితో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎంపిపి పద్మావతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారులుగా పదోన్నతిపై బదిలీపై వెళ్ళిన భీమవరపు మధుసూధనరెడ్డి, శ్రీనివాసమూర్తిలను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ నిజాయతీ, నిబద్ధతతో పనిచేసినప్పుడే ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిఉంటాలని చెబుతూ ఆ కోవకు చెందిన వ్యక్తులు మధు సూధనరెడ్డి, శ్రీనివాసమూర్తి అని కొనియాడారు. ఎంపీడీవో విజయ లక్ష్మి మాట్లాడుతూ మధు సూధనారెడ్డి, శ్రీనివాసమూర్తి క్రమ శిక్షణతో పనిచేసి పలువురు మన్ననలు పొందారని వారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటు న్నానన్నారు. కార్యక్రమంలో పరిపాల నాధికారులు కిషోర్‌కుమార్, చంద్ర మోహన్, డిప్యూటి ఎంపీడీ వోలు భార్గవ్, దానయ్య, ఏఈ అవుతు సాంబి రెడ్డి, కార్యదర్శులు ,పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అక్రమంగా తరలిస్తున్న 6మట్టి లారీలు సీజ్

**కొల్లిపర, మార్చి 4 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వల్లభాపురం గ్రామానికి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరులారీలను సీజ్ చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. బుధవారం తెలవారుజామున మున్నంగి, వల్లభాపురం,



కొల్లిపర, బొమ్మువానిపాలెం గ్రామాలలో ఎస్ తన సిబ్బందితో కలసి వాహనాలను ఆకస్మిక తనిఖీ చేసారు. రాజధాని ప్రాంతమైన ఉద్దండ రాయుని పాలెం నుండి వల్లభాపురం గ్రామానికి బిల్లులు లేకుండా నల్ల మట్టిని తరలిస్తున్న 6 మట్టి లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ఘనంగా శ్రీతిరపతమ్మ గోపయ్య స్వామి వారి తిరుణాళ్ల

**కొల్లిపర, మార్చి 4, ప్రభాతవార్త:** మండలంలో శ్రీతిరపతమ్మ గోపయ్య స్వామి వారి తిరుణాళ్ళ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పొంగళ్ళు చేసుకుని స్వామి వార్లకు నైవేద్యంగా తీసుకెళ్ళారు. పసుపు, కుంకుమ, గాజులుఅమ్మవార్లకు సమర్పించారు. మొక్కుబడులు



తీర్చుకున్నారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీతిరపతమ్మ గోపయ్య స్వామి వారి దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అసౌక్యాలు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీతిరపతమ్మ గోపయ్య స్వామి వారి తిరుణాళ్ళు ఘనంగా జరిగాయి. ఆలయాలు విద్యుత్ కాంతులతో దగదగ మెరిసాయి.

# ఉన్నత ఉపాధి అవకాశాలే లక్ష్యంగా సమ్మిట్ : వీసి గంగాధరరావు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, మార్చి4, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో నేటి నుంచి ప్రారంభం కానున్న అకడమిక్- ఇండస్ట్రీ సమ్మిట్ ను ఉద్యోగ,



ఉపాధి అవకాశాలు లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు వీసి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. బుధవారం సమ్మిట్ నిర్వహణ కమిటీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మిట్ ద్వారా విద్యార్థులకు వివిధ కంపెనీ ప్రతినిధులతో ఇంటరాక్షన్ జరుగుతుందన్నారు. కంపెనీలకు కావల్సిన నైపుణ్యాలు విద్యార్థుల్లో పెంచేలా సిలబస్‌కూడా మార్పులు చేస్తామన్నారు. సమ్మిట్‌కు హాజరయ్యే కంపెనీలకు అన్ని విభాగాల్లో అధ్యాపకులు, విద్యార్థులు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. కమిటీలు కూడా ఏర్పాట్లలో లోటురాకుండా చూడాలన్నారు. కంపెనీలకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేశామని వివరించారు.

# శనగల కొనుగోలు వేగవంతం చేయాలి : రైతు సంఘం డిమాండ్

పెదనందిపాడు మార్చి 4 (ప్రభాతవార్త) శనగల కొనుగోలు వేగవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో జరిగిన రైతు సంఘం సమావేశం లో .పాశం రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం శనగల మద్దతు రేటు క్వింటాలుకు 5,875 రూపాయలు మద్దతు ధర ప్రకటించిందని, ప్రైవేటు వ్యాపారస్తులు 4,800 నుండి 5,000 కు రైతుల వద్ద నుండి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు తెరిచామని చెబుతున్నా, కొనుగోలు జరపకపోవడంతో రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారని చెప్పారు. శనగ పంట సాగుకు రైతులు ఎకరానికి 40 వేల వరకు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. సగటున ఎకరానికి 8 క్వింటాళ్లు వస్తుందని, ప్రభుత్వ మద్దతు రేటుకు కొనుగోలు చేస్తేనే రైతులకు పెట్టుబడి ఖర్చులు వస్తాయని తెలిపారు. లేకపోతే ప్రైవేట్ వ్యాపారస్తుల ధరలతో పెద్ద ఎత్తున నష్టపోతారని తెలిపారు. వెంటనే తేమశాతం వంటి ఇతర నిబంధనలను సడలించి రైతుల వద్ద నుంచి మొత్తం శనగలు కొనుగోలు చేయాలని కోరారు.



అదేవిధంగా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇచ్చి, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అందజేయాలని కోరారు. త్వరలో మొక్కజొన్న పంట చేతికి వస్తుందని 2,400 మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, పంటల భీమా పథకాన్ని ప్రభుత్వమే ఉచితంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, దొప్పలపూడి రమేష్ బాబు, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు.

